
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



5

జనగామ

మంగళవారం 16 ఏప్రిల్ 2024

చిట్టీల పేరిట చీటింగ్

కొందరు నెలవారీ చిట్టీల పేరుతో ప్రజలను దోచుకుంటున్నారు. రూ.లక్ష చిట్టీని 25మంది నెలకు రూ.4వేల చొప్పున 25నెలలు చెల్లించాలి. ఇందులో డ్రా తీసి ఎవరికి వస్తే వారికి కొందరు చెల్లిస్తుండగా, ఎవరు ఎక్కువ పాట పాడితే వారికి ఇస్తున్నారు. డబ్బులు అత్యవసరం ఉన్నవారు రూ.లక్షకు రూ.25వేల వరకు కూడా పాడి డబ్బులు తీసుకుంటున్నారు. దీంతో 25శాతం వడ్డీ చెల్లించాల్సి వస్తుంది. పైగా చిట్టీ నిర్వహకులు కూడా ప్రతీ వ్యక్తి నుంచి 5శాతం కమీషన్‌గా తీసుకుంటున్నారు. అయితే ఈ చిట్టీల వ్యాపారుల్లో కొందరు.. తమకు చిట్టీల డబ్బులు చెల్లించిన వారికి ఇవ్వకుండా ఉడాయించిన సంఘటనలున్నాయి. అలాగే మండల కేంద్రాల్లో లక్కీ డ్రాల పేరుతో ద్విచక్ర వాహనాలను ఆశ చూపుతు లక్షల్లో వసూళు చేసి దుకాణం మూసేస్తున్నారు.


వడ్డీ మాఫియా!

వరంగల్‌లోని ఇంతేజార్‌గంజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ కార్పొరేటర్ ప్రజల నుంచి నెలవారీ చిట్టీల పేరుతో సుమారు రూ.2కోట్ల వరకు డబ్బులు వసూ లు చేశాడు. చివరకు వసూలు చేసిన డబ్బులను తనకు చిట్టీలు కట్టిన వారికి ఇవ్వ కుండా.. తనకే నష్టం వచ్చిందని బెదిరింపులకు దిగాడు. దీంతో బాధితులు ఇంతేజార్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

తీసుకున్న అప్పు చెల్లించలేదంటూ హనుమకొండకు చెందిన ఓ వ్యక్తిని... తమకు ఇంటి స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేయాలని వడ్డీ వ్యాపారి ఒత్తిడి చేస్తున్నాడు. దీంతో ఆ బాధితుడు లబోదిబోమంటున్నాడు.

వరంగల్ రంగశాయపేటలో అధిక వడ్డీ బాధితుడు ఒకరు సొంత ఇంటిని, ఇంటి స్థలాన్ని కోల్పోయాడు. రూ.1లక్ష అప్పు తీసుకుంటే.. నాలుగేళ్లలో సొంతింటిని కోల్పోయే స్థాయిలో అతడి అప్పులు పెరిగిపోయాయి. దీంతో బాధితుడి కుటుంబం వీధిన పడింది.

శివనగర్‌లో ఓ యువకుడు వడ్డీ వ్యాపారి నుంచి రూ.1.30లక్షల అప్పు తీసుకున్నారు. దీనికి రూ.10 చొప్పున వడ్డీ చెల్లిస్తున్నాడు. ఏడాది కాలంలోనే రూ.1.38లక్షల అప్పునకు రూ.1.28లక్షల వడ్డీ చెల్లించాడు. అయితే ఆరోగ్యం బాగా లేకపోవటంతో అసలు డబ్బు మాత్రం చెల్లించక పోవడంతో వడ్డీ వ్యాపారి వేధిం చడం మొదలు పెట్టడంతో బాధితుడు మిల్స్ కాలనీ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.



- జనం అవసరాలే ఆసరాగా కొందరి అధిక వడ్డీ దందా
- రూ.100కు రూ.10 చొప్పున వడ్డీ వసూలు
- మైక్రో ఫైనాన్స్, నెలవారీ చిట్టీల పేరిట జనం సొమ్ము దోపిడీ
- అక్రమంగానే వ్యవహారమంతా..
- చోటా మోటా నేతలు, కొందరు కార్పొరేటర్లు, వారి అనుచరులే సూత్రధారులు
- రూరల్ ప్రాంతాల్లో వడ్డీపై పోలీసుల ఉక్కుపాదం
- నగరంలో మాత్రం ఖాకీలది ప్రేక్షక పాత్రే!

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి- వరంగల్)

రూ.100కు రూ.10, రూ.వెయ్యికి రూ.100, రూ.లక్షకు రూ.పది వేలు.. ఇదీ వడ్డీ వ్యాపారుల లెక్క.. జనాల అవసరాలను ఆసరాగా చేసుకుని జలగల్లా పట్టి పీడిస్తున్న వడ్డీ మాఫియా కథ. ప్రజల అవసరాన్ని ఆసరాగా చేసుకుని కొందరు అధిక వడ్డీకి అప్పులు ఇస్తూ.. ఆస్తులు, బంగారం తాకట్టు పెట్టుకుం టున్నారు. ఆ అప్పు చెల్లించకుంటే తాకట్టు పెట్టుకున్న ఆస్తిని జప్తు చేసుకుంటున్న సంఘటనలున్నాయి.

దీంతో అధిక వడ్డీలు చెల్లించలేక మానసిక, ఆర్థిక ఒత్తిడితో అనేక కుటుంబాలు రోడ్డున పడు తున్నాయి. ఉమ్మడి వరంగల్ జిల్లాలో కొన్ని ప్రాంతాల్లో పోలీసుల అండ దండలతోనే ప్రైవేట్, డైలీ ఫైనాన్స్ మాఫియా రెచ్చిపోతోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

అవసరాలే ఆసరాగా...

డబ్బు అత్యవసరం ఉన్న ప్రజలే లక్ష్యంగా కొందరు వడ్డీ వ్యాపారులు తమ దందా సాగిస్తున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని అన్ని జిల్లా కేంద్రాలతో పాటు మునిసి పాలిటీల్లో గిరిగిరి దందా జోరుగా సాగుతోంది. ఎలాంటి అనుమతులు లేకుండా జరుగుతున్న ఈ వ్యవహారంతో అనేక మంది జీవితాలు వీధిన పడుతున్నాయి. ముఖ్యంగా చిరు వ్యాపారులు, కూరగాయలు, పండ్లు విక్రయించే వీధి వ్యాపారులు, ఆటో నడుపుకొనే వారు, కూలీలు లక్ష్యంగా వడ్డీ వ్యాపారం జరుగుతోంది. డబ్బులు అత్యవసరం ఉన్నవారి నుంచి రూ.100కు రూ.10వడ్డీ వసూలు చేస్తున్నారు. రూ.10వేల అప్పు తీసుకున్న వారికి రూ.వెయ్యి కోత పెట్టి రూ.9వేలు ఇస్తున్నారు. వారానికి రూ.వెయ్యి చొప్పున పదివారాల్లో వసులు చేస్తున్నారు. ఇంకొన్ని చోట్ల ఉదయం రూ.900 ఇచ్చి సాయంత్రం రూ.వెయ్యి తీసుకుంటున్నారు. 12గంటల తిరగక ముందే ఒక వెయ్యి రుపా యలకు రూ.100 వడ్డీ వసూలు చేస్తున్నారు. ఇలా ఒక రోజు లక్ష రుపాయలు వడ్డీకి ఇస్తే ఒక రోజులోనే రూ.10 వేల వడ్డీ లాగేస్తున్నారు. నెలకు రూ.వెయ్యికి రూ.వంద వడ్డీ చొప్పున వసూలు చేస్తున్నారు. అప్పు ఇచ్చే సమయంలో ఖాళీ చెక్కులు, పట్టాదారు పాసు పుస్తకాలు, బంగారు నగలు, స్థిరాస్తి హక్కు పత్రాలు, ద్విచక్రవాహనాలు, ఆటోలు, కార్లు ఇతర వాహనాలను తాకట్టు పెట్టుకుంటున్నారు. ఒక వేళ ఏదైనా కారణాలతో అప్పు చెల్లించకపోతే తాకట్టు పెట్టుకున్న ఆస్తిని లాక్కుంటున్నారు. ఖాళీ చెక్కులతో కోర్టుల చుట్టూ తిప్పుతూ ఇబ్బందులు పెడుతున్నారు. దీంతో చాలామంది మానసికంగా ఒత్తిడికి గురవుతున్నారు. సమాజంలో పరువు పోతుందని కొందరు ఆత్మహత్యలకు కూడా పాల్పడుతున్న సంఘటనలు ఉన్నాయి.

దందాలో రాజకీయ నేతలు, టీచర్లు, పోలీసులు

గిరిగిరి దందాలో కొందరు రాజకీయ నేతలతో పాటు చాలా ప్రాంతాల్లో కొందరు టీచర్లు కూడా ఉన్నారు. ప్రధానంగా వరంగల్ పోలీస్‌కమిషనరేట్ పరిధిలో వడ్డీ వ్యాపారం జోరుగా సాగుతుంది. కొన్ని ఏరియాల్లో పోలీసుల అండదండలతోనే అధిక వడ్డీ వ్యాపారం సాగుతున్నట్లుగా ప్రచారం జరుగుతోంది. వరంగల్ తూర్పు ప్రాంతంలో ముగ్గురు కార్పొరేటర్లు, మరో నలుగురు మాజీ కార్పొరేటర్లు వడ్డీ వ్యాపారం రూ.లక్షల్లో సాగిస్తున్నారు. అధికార పార్టీ అండదండలు కొందరికి ఉండగా, మరికొందరికి ఖాకీల సాన్నిహి త్యం ఉన్నట్టు సమాచారం. దీంతో శివనగర్, రంగాశాయిపేట, బట్టల బజారు, ఉర్సు, రైల్వేగేటు, మిల్స్ కాలనీ తదితర ప్రాంతాల్లో గిరిగిరితో పాటు రూ.లక్షల్లో వడ్డీ వ్యాపారం సాగిస్తున్నారు. అధికార బలంతో పాటు ఖాకీల సహకారం ఉండటంతో ఫైనాన్స్ దందాను యథేచ్ఛగా నిర్వహిస్తున్నారు. వరంగల్ పశ్చిమ

మిగతా 7వ పేజీలో..



కమిషనరేట్ పరిధిలో మౌనమేల?

అధిక వడ్డీ వ్యాపారులపై రాష్ట్ర వ్యాప్తంగా దాడులు జరుగుతుంటే.. వరంగల్ కమిషనరేట్ పరిధిలోని పోలీసులు మౌన ముద్రలో ఉండ టంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. భూ పాలపల్లి జిల్లా కేంద్రంలో ఈ నెల 8వ తేదీన ఫైనాన్స్ వ్యాపారి వేధింపులు భరించలేక గణేష్ చౌరస్తాలో నివాసం ఉంటున్న బయ్యావుల ఏడు కొండలు అనే చిరు వ్యాపారి ఉరి వేసుకుని ఆత్మ హత్యకు పాల్పడ్డారు. దీంతో రంగంలోకి దిగిన పోలీసుశాఖ రాష్ట్రవ్యాప్తంగా వడ్డీ వ్యాపారులపై నిఘా పెట్టి తనిఖీలు చేపడుతుంది. ములుగు పోలీసులు ఏటూరునాగరంలోని ఓ మహిళ వడ్డీ వ్యాపారి ఇంట్లో సోదాలు చేసి, విలువైన దస్త్రాలు స్వాధీనం చేసుకున్నారు. భూపాలపల్లి జిల్లాలో భూపాలపల్లి, మహదేవపూర్‌లోని వడ్డీ వ్యాపారుల ఇళ్లలో సోదాలు చేశారు. అయితే వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో మాత్రం వడ్డీ వ్యాపారులపై పోలీసుల దాడులు లేకపోవడం వెనుక మతలబు ఏంటన్న చర్చ జరుగుతోంది. ఇక్కడి వడ్డీ వ్యాపారుల్లో అనేక మంది రాజకీయ నేతలు, వారి అనుచరులు ఉండటంతోనే వారిని టచ్ చేసేందుకు ఖాకీలు సాహసం చేయడం లేదన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కోట్లాది రుపాయలను అధిక వడ్డీలకు తిప్పుతు న్నారనే సమాచారం ఉన్నా పోలీసులు పట్టించు కోకపోవడం చర్చనీయాంశంగా మారింది. 2022 జూలై 28న వడ్డీ వ్యాపారుల వేధింపులు తట్టు కోలేక ఓ మహిళ మట్టేవాడ మహిళ పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించింది. పోలీసులు వడ్డీ వ్యాపా రికి వత్తాసు పలకటంతో పోలీస్‌స్టేషన్‌లోనే పురు గుల మందు తాగిన సంఘటన ఖాకీల పరువు ను బజారున పడేసింది. అయినప్పటికీ పోలీసుల తీరులో మాత్రం మార్పు రాలేదన్న చర్చ జరుగుతోంది.

వెన్నుపోటు రాజకీయాలకు కేరాఫ్ కడియం

నాడు ఎన్టీఆర్‌కు.. నేడు కేసీఆర్‌కు నమ్మక ద్రోహం

విదేశాల్లో దాచుకున్న సందపను త్వరలోనే వెల్లడిస్తా

మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న తాటికొండ రాజయ్య

వివరాలు 8లో..

మోదీకి ఓటేస్తే రాజ్యాంగాన్ని రద్దు చేస్తారు

- కాంగ్రెస్‌ను గెలిపిస్తే వరంగల్‌ను అభివృద్ధి చేస్తా
- ఎంపీ అభ్యర్థి కడియం కావ్య
- పాలకుర్తిలో సన్నాహక సమావేశం

పాలకుర్తి, ఏప్రిల్ 15 : దేశంలో మూడోసారి భారతీయ జనతా పార్టీ అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని రద్దు చేసి, రిజర్వేషన్లను తొలగిస్తారని వరంగల్ పార్లమెంటు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి డాక్టర్ కడియం కావ్య ఆరోపించారు. సోమవారం పాలకుర్తిలో నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆమె మాట్లాడారు. బీజేపీ అధికారంలోకి వచ్చి పదేళ్లు గడిచినా ఉద్యోగ నియామకాలు చేపట్టలేదని విమర్శించారు. ఏడాదికి 2 కోట్ల ఉద్యోగాలు అంటే పదేళ్లలో 20 కోట్ల ఉద్యోగాలు ఇవ్వకుండా నరేంద్రమోదీ ప్రజలను మోసం చేశారని అన్నారు. రాముడి పేరుతో రాజకీయాలు చేయడం సిగ్గు చేటని విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో వరంగల్ పార్లమెంటు సభ్యురాలిగా తనను గెలిపిస్తే నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని అన్నారు.

నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి... రేవూరి ప్రకాశ్‌రెడ్డి మాట్లాడుతూ పదేళ్లు ముఖ్యమంత్రిగా పని చేసిన కేసీఆర్ రాష్ట్రాన్ని దోచుకుతిన్నారని ఆరోపించారు. వచ్చే ఎన్నికల్లో కావ్యను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడతూ యశస్వినిరెడ్డి, ఝాన్సీ రెడ్డి కొట్టిన దెబ్బకు మాజీ మంత్రి దయాకర్‌రావు చిన్న మెదడు చితికిపోయిందని ఎద్దేవా చేశారు. బీజేపీ మతాలు, కులాల మధ్య చిచ్చు పెట్టి రాజకీయ పబ్బం గడుపుకుంటోందని విమర్శించారు.

కార్యక్రమంలో వర్ధన్నపేట, భూపాలపల్లి ఎమ్మెల్యేలు కే.ఆర్ నాగరాజు, గండ్ర సత్యనారాయణరావు, ఏఐసీసీ బీసీ సెల్ నాయకుడు కత్తి వెంకటస్వామి, నాయకులు బొబ్బాల రమణారెడ్డి, ఎర్రబెల్లి రాఘవరావు, కాకిరాల హరిప్రసాద్, వంగాల మల్లారెడ్డి, కుందూరు గోపాల్‌రెడ్డి, రాపాక సత్యనారాయణచ గిరగాని కుమారస్వామి పాల్గొన్నారు.

అభివృద్ధి కోసమే కాంగ్రెస్‌లో చేరా: కడియం

జఫర్‌గడ్: నియోజకవర్గ అభివృద్ధి కోసమే తాను కాంగ్రెస్‌లో చేరానని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. సోమవారం జఫర్‌గడ్‌లో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాహుల్ గాంధీని ప్రధానిని చేయడమే లక్ష్యంగా ప్రతీ కార్యకర్త కష్టపడి పని చేయాలన్నారు. వరంగల్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కడియం కావ్యను అధిక మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సింగపురం ఇందిర మాట్లాడుతూ రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో కావ్యను గెలిపించి కాంగ్రెస్ జెండా ఎగురవేయాలని పిలుపునిచ్చారు. ఎంపీ అభ్యర్థి కడియం కావ్య మాట్లాడుతూ జరగబోయే పార్లమెంటు ఎన్నికల్లో మీ ఇంటి ఆడపడుచుగా తనను ఆశీర్వదించాలని అభ్యర్థించారు. అక్రమాలు, అవినీతికి తావీయకుండా ఎమ్మెల్యే శ్రీహరి, ఇందిర సహకారంతో నియోజకవర్గం అభివృద్ధికి పాటుపడతానన్నారు. తాను ఎలాంటి భూకబ్జాలకు పాల్పడలేదని, తనకు రియల్ ఎస్టేట్ వ్యాపారాలు లేవని.. ప్రజాసేవే తన లక్ష్యమని అన్నారు. ఈ సందర్భంగా మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరారు.



పాలకుర్తిలో మాట్లాడుతున్న కడియం కావ్య

సమావేశంలో పార్టీ నియోజకవర్గ కో-ఆర్డినేటర్ వెంకట్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి జగదీశ్‌రెడ్డి, ఎంపీపీ సుదర్శన్, జడ్పీటీసీ జేబీ శ్రీనివాస్, సొసైటీ చైర్మన్ కరుణాకర్‌రావు, ఎంపీటీసీ జ్యోతి రజిత, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నూకల అయిలయ్య, జిల్లా, మండల నేతలు ఎ.బిక్షపతి, మంచాల ఎల్లయ్య, కట్టా మనోజ్‌రెడ్డి, బ్రహ్మారెడ్డి, ఎడ్ల వెంకటస్వామి, రాజేశ్ నాయక్, మోహన్‌రావు, టి.రాజెందర్, రాజ్‌కుమార్, కుల్ల రాజు, మొగిలి, రాజయ్య, సత్యనారాయణ తదితరలు పాల్గొన్నారు.

వర్ధన్నపేటలో చెల్లని రూపాయి ఘన్‌పూర్‌లో చెల్లుతుందా?

బీజేపీ ఎంపీ అభ్యర్థి అరూరిని ఉద్దేశించి ఎమ్మెల్యే కడియం వ్యాఖ్యలు - వివరాలు 8లో..

విద్యుత్ పనుల్లో నిర్లక్ష్యం వద్దు

విధుల్లో ఉండగా ఫోన్ మాట్లాడొద్దు

అవగాహన సదస్సులో ఎస్ఈ వేణుమాధవ్



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఎస్ఈ వేణుమాధవ్

లింగాలఘణపురం, ఏప్రిల్15: విద్యుత్ మరమ్మతు పనుల్లో సిబ్బంది నిర్లక్ష్యం చేయొద్దని, ఆ సమయంలో ఎర్తరాడ్లను తప్పనిసరిగా వినియోగించాలని ఎన్‌పీడీసీఎల్ ఎస్ఈ వేణుమాధవ్ సూచించారు. సోమవారం లింగాలఘణపురం మండలం నెల్లుట్లలో విద్యుత్ సిబ్బందికి సేఫ్టీ అండ్ మెజర్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఎస్ఈ వేణుమాధవ్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. జిల్లాలో ఇటీవల వరుసగా జరిగిన విద్యుత్ ప్రమాదాల్లో ముగ్గురు కట్టర్లు మృతిచెందగా ఒకరు శాశ్వత అంగవైకల్యానికి గురి కావడం బాధాకరమన్నారు. క్షేత్రస్థాయిలో పనిచేసే కట్టర్లు, జేఎల్‌ఎంలపై పనిభారం తీవ్రంగా ఉందని, మరమ్మత్తు పనులు చేస్తున్నపుడు కచ్చితంగా ఎల్‌సీ తీసుకున్నట్లు నిర్ధారించుకున్న తర్వాతే పైస్థాయి అధికారుల పర్యవేక్షణలో పనులు ప్రారంభించాలని అన్నారు. పనిచేస్తూ ఎట్టిపరిస్థితుల్లో సెల్‌ఫోన్ మాట్లాడొద్దని, ఎర్తరాడ్లను వినియోగిస్తే ప్రమాదాలను నివారించవచ్చని అన్నారు. ఇప్పటివరకు జరిగిన ప్రమాదాకు ఎర్తరాడ్లను వినియోగించకపోవడమే ప్రధాన కారణమన్నారు. చిన్న నిర్లక్ష్యం కారణంగా నిండు జీవితం బలవుతుందని, ఆ కుటుంబం రోడ్డునపడుతుందని అన్నారు. ప్రతీ ఉద్యోగికి గ్లౌజులు, టెస్టర్, ఎర్తరాడ్లతో పాటుగా సేఫ్టీ జాకెట్లను అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు.

ఈ అవగాహన సదస్సులో ఎస్ఏవో జయరాజ్, డీఈలు లక్ష్మారెడ్డి, విజయ్ కుమార్, ఎంఆర్‌టీ డీఈ ప్రభావతి ఏడీఈ అనిల్‌కుమార్, మనోహర్‌రెడ్డి, వేణుగోపాల్‌తో పాటుగా జనగామ సబ్ డివిజన్‌కు చెందిన ఏఈలు, సబ్ ఇంజనీర్లు, ఫోర్‌మెన్లు, లైన్ఇన్స్‌పెక్టర్లు, లైన్‌మెన్లు, జేఎల్‌ఎంలు, కట్టర్లు, ఉద్యోగసంఘాల బాధ్యులు మొత్తం 250 మంది క్షేత్రస్థాయి సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకోవాలి

ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి

స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్, ఏప్రిల్ 15: ప్రభుత్వ పాఠశాలలను ప్రజలు కాపాడుకోవాలని, ఇందుకోసం విద్యార్థుల సంఖ్య పెంచాలని, మెరుగైన విద్య అందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని వరంగల్-నల్లగొండ-ఖమ్మం ఉమ్మడి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం శివునిపల్లి హైస్కూల్‌లో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు అంశంపై టీఎస్ యూటీఎఫ్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వర్క్ షాప్‌లో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో నే ఉన్నత విద్యార్హతలు ఉన్న ఉపాధ్యాయులు ఉంటారని, పిల్లలకు మెరుగైన విద్య అందుతుందని, తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటైన కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ పబ్లిక్ స్కూళ్ల పేరుతో పాఠశాలల ఏర్పాటుకు ప్రయత్నిస్తోందని అన్నారు. ఐతే ఇప్పుడున్న పాఠశాలలను మూసి వేసే కుట్రలో భాగంగానే ఇవి ఏర్పాటు చేస్తున్నారని ఆరోపించారు. ప్రస్తుతం ఉన్న పలు రకాల ప్రభుత్వ పాఠశాలలను కొన్ని చోట్ల విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా సమీప రెవెన్యూ గ్రామాల్లో విలీనం చేయాలన్నారు. అలాగే ఎక్కువ విద్యార్థుల సంఖ్య ఉన్న కొన్ని పాఠశాలలను అప్‌గ్రేడ్ చేయాలన్నారు. సరిపోను విద్యార్థుల సంఖ్య లేని ప్రాథమికోన్నత పాఠశాలలను ప్రాథమిక పాఠశాలలుగా డిగ్రేడ్ చేయాలని, కొన్ని హైస్కూళ్లను అప్‌గ్రేడ్ చేయాలని ప్రతిపాదించారు.



వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

సమావేశానికి సంఘం జిల్లా అధ్యక్షుడు పి.చంద్రశేఖర్ రావు అధ్యక్షత వహించగా రాష్ట్ర కార్యదర్శి కె.రంజిత్ కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు మంగు జయ ప్రకాష్, టి.హేమలత, టి.సుధాకర్, జిల్లా నాయకులు సిహెచ్ శ్రీనివాస్, పి.వెంకటాద్రి, యాదవరెడ్డి, కె.సుధీర్, కందుల శ్రీనివాస్, టి.శ్రీనాథ్, జిల్లాలోని 12 మండలాల అధ్యక్ష, కార్యదర్శులు, సభ్యులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర

\- కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా

దేవరుప్పుల, ఏప్రిల్ 15: ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే రైతులు ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా సూచించారు. సోమవారం ఆయన సింగరాజుపల్లి, కామారెడ్డిగూడెం, సీతారాంపురం గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించారు. సింగరాజుపల్లిలో వడ్లలో తేమ శాతాన్ని చెక్ చేశారు. కామారెడ్డిగూడెంలో తూకం వేస్తున్న వడ్ల బస్తాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు మద్దతు ధర ఇచ్చేందుకే ప్రభుత్వం కొనుగోలు కేం ద్రాలను ఏర్పాటు చేసిందని, దళారులకు తక్కువ ధరలకు విక్రయించి మోసపోవద్దని అన్నారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల్లో ప్యాడీక్లీనర్లు, టార్పాలిన్లు, గన్నీబ్యాగ్స్ అందుబాటులో ఉంచామన్నారు. దళారులు క్వింటాకు రూ.1600 నుంచి రూ.1800 మాత్రమే ఇస్తున్నారని, ప్రభుత్వం ఏ గ్రేడ్ రకానికి రూ. 2203, సాధారణ రకానికి రూ.2183 ఇస్తుందని అన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో సమస్యలు ఉంటే టోల్ ఫ్రీ 89192 88991 నెంబరుకు ఫోన్ చేయాలన్నారు. అనంతరం దేవరుప్పులలోని అనంతరామ పార్‌బాయిల్డ్ రైస్ మిల్ ను సందర్శించారు. ఆ తర్వాత దేవరుప్పుల హరిజనకాలనీలోని ప్రాథమిక, సీతారాంపురంలోని ప్రాథమికోన్నత పాఠశాలలను ఆయన సందర్శించారు. అమ్మ ఆదర్శ పాఠశాల కార్యక్రమం కింద చేపడుతున్న అభివృద్ధి పనుల పురోగతిని తెలుసుకున్నారు. మండల పరిషత్, రెవెన్యూ కార్యాలయాలను పరిశీలించి ఎండిపోతున్న మొక్కలను చూసి ఆగ్రహం వ్యక్తం చేశారు. నీళ్లు పోసి కాపాడాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీవో మొగులప్ప, డీఎస్‌వో రోజారాణి, డీఈవో రాము, పీఆర్‌ఈఈ చంద్రశేఖర్, మండల అధికారులు పాల్గొన్నారు.



సింగరాజుపల్లిలో ధాన్యంలో తేమను చెక్ చేస్తున్న కలెక్టర్ రిజ్వాన్ బాషా

సోమేశ్వరాలయంలో ఆరుద్రోత్సవం



ఆరుద్రోత్సవం నిర్వహిస్తున్న పూజారులు

పాలకుర్తి, ఏప్రిల్ 15: శ్రీ సోమేశ్వరలక్ష్మీనర్సింహ స్వామి ఆలయంలో సోమవారం ఆరుద్ర నక్షత్రం సందర్భంగా ఆరుద్రోత్సవం నిర్వహించారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో ఆలయ పండితులు, పూజారుల వేద మంత్రాల మధ్య కన్నుల పండువగా వేడుకలు జరిపించారు. 108 లీటర్ల ఆవు పాలతో అభిషేకం చేశారు. గర్భాలయ దీపోత్సవం, పుష్పాలంకరణ, విశేష నీరాజనం, మంత్రపుష్పం నిర్వహించారు. భక్తులు అధికసంఖ్యలో హాజరై మొక్కులు చెల్లించారు. కార్యక్రమంలో ఈవో లక్ష్మీప్రసన్న, డీ.వీ.ఆర్ శర్మ, నాగరాజు, అనిల్, రామన్న, లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై ప్రచారం

స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్, ఏప్రిల్ 15: అగ్ని ప్రమాదాల నివారణ వారోత్సవాల్లో భాగంగా సోమవారం రెండో రోజు స్టేషన్‌ఘన్‌పూర్ ఫైర్ స్టేషన్ సిబ్బంది స్థానిక రైల్వే స్టేషన్‌లో ప్రచారం నిర్వహించారు. పోస్టర్లు, కరపత్రాలతో ప్రయాణీకులు, రైల్వే స్టేషన్ సిబ్బందికి నివారణ జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో రైల్వే స్టేషన్ మేనేజర్ వీరకుమార్, ఫైర్ స్టేషన్ సిబ్బంది లింగయ్య, లీడింగ్ ఫైర్‌మెన్ సందీప్ రెడ్డి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

బాలసముద్రం, ఏప్రిల్ 15: రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని దళిత, గిరిజన టీచర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పెండ్యాల కొమురయ్య ఒక ప్రకటనలో సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా కొమురయ్య మాట్లాడుతూ.. ప్రభుత్వం ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు వెంటనే చేపట్టి వారి సమస్యలను పరిష్కరించాలని పెండ్యాల కొమురయ్య డిమాండ్ చేశారు.







విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మంద నరేశ్









వరంగల్ లోక్‌సభ బరిలో ఉంటా..

ఏబీఎస్ఎఫ్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు మంద నరేశ్

కేయూ క్యాంపస్, ఏప్రిల్ 15: వరంగల్ లోక్‌సభ స్థానం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తానని ఏబీఎస్ఎఫ్ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు మంద నరేశ్ చెప్పారు. సోమవారం కేయూలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంద నరేశ్ మాట్లాడారు. లోక్‌సభ ఎన్నికల్లో విద్యార్థి ఉద్యమకారులకు ఏ రాజకీయపార్టీ టికెట్లు కేటాయించకపోవడాన్ని ఖండించారు. తాను విద్యార్థి సమస్యలపై పోరాటం చేసినట్లు తెలిపారు. పోరాటాలు చేసిన క్రమంలో కేసులపాలైనట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాడినట్లు వివరించారు. పార్టీలు మారిన రాజకీయ నాయకులకు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. తాను ఎంపీగా గెలిస్తే నీతి, నిజాయితీగా పనిచేస్తానని, అందరూ తనను ఆశీర్వదించి గెలిపించాలని అన్నారు. ఈ సమావేశంలో కేయూ విద్యార్థి నాయకులు అరిస్టాటిల్, వివేకనంద, సిద్ధు, నవీన్, కిరణ్, సాయి, వెంకటేశ్, సందీప్, కల్యాణ్, సురేశ్, రాజు, రమేశ్, నరేందర్, సూర్య, దిలీప్, శివ పాల్గొన్నారు.



రైలు నుంచి జారిపడి ఇద్దరు మృతి

కాజీపేట, ఏప్రిల్ 15: ఉప్పల్ రైల్వేస్టేషన్ పరిధిలో రెండు వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు ప్రయాణికులు మృతిచెందారు. కాజీపేట రైల్వే పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఉత్తరప్రదేశ్ ఆగ్రాకు చెందిన అరుణ్ (21) ఆగ్రా నుంచి హైదరాబాద్‌కు వెళ్లేందుకు దక్షిణ్ ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణిస్తుండగా సోమవారం ఉప్పల్ రైల్వేస్టేషన్ వద్ద రైలు నుంచి జారిపడి మృతి చెందాడు. కాగా, సిర్పూర్ కాగజ్‌నగర్‌కు చెందిన ఫిరోజ్ (25) సికింద్రాబాద్‌కు వెళ్లేందుకు సోమవారం కాగజ్‌నగర్ ఎక్స్‌ప్రెస్ రైల్లో ప్రయాణిస్తుండగా హసన్‌పర్తి రైల్వే స్టేషన్ ఫిరోజ్ రైలు నుంచి జారిపడ్డాడు. ఈ ఘటనలో అతడి రెండు కాళ్లు తెగిపడ్డాయి. రైల్వే ఉద్యోగుల సమాచారం మేరకు అపస్మారక స్థితిలో ఉన్న ఫెరోజ్‌ను ఎంజీఎంకు తరలించగా చికిత్సపొందుతూ మృతి చెందాడు. మృతుల వద్ద ఆధారాల మేరకు వారి కుటుంబీకులకు సమాచారం ఇచ్చినట్లు పోలీసులు తెలిపారు.

కడియం కావ్యకు సంపూర్ణ మద్దతు

కాజీపేట, ఏప్రిల్ 15: కాంగ్రెస్ లోక్‌సభ వరంగల్ అభ్యర్థి కడియం కావ్యకు తమ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నామని మాదిగ హక్కుల దండోరా, మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి నాయకులు జన్ను కనుకరాజ్, ఈటక రాజు మాదిగ తెలిపారు. ఈ సందర్భంగా కాజీపేట సోమవారం మీడియా పాయింట్‌లో మాట్లాడారు. ఎస్సీలకు వంద రోజుల్లో వర్గీకరణ చేస్తామని చెప్పిన బీజేపీ మాదిగలకు తీవ్ర అన్యాయం చేసిందన్నారు. బీజేపీకి మద్దతు ప్రకటిస్తున్న మంద కృష్ణ మాదిగను మాదిగలు వ్యతిరేకించాలన్నారు. మాదిగలకు తీవ్ర అన్యాయం చేసిన బీజేపీ అభ్యర్థులను మాదిగలంతా ఐక్యంగా వుండి లోక్‌సభ ఎన్నికల్లో ఓడించాలన్నారు. ఈ మీడియా సమావేశంలో మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కె. పద్మయ్య జిల్లా అద్యక్షులు వేముల బలరాములు, నాయకులు కోరిపల్లి శ్రీనివాస్, వీరయ్య,సి. బాలరాజ్, కొట్టి శ్రావణ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

నేటి 5కే రన్ వాయిదా

హనుమకొండ కలెక్టరేట్, ఏప్రిల్ 15: ఓటరు చైతన్యంపై నేడు ఉదయం 6గంటలకు నిర్వహించే 5 కేరన్‌న అనివార్య కారణాల వల్ల వాయిదా వేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మళ్లీ 5కే రన్ ఎప్పుడు నిర్ణయించేది త్వరలో చెబుతామని కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.







హత్యానేరం కేసులో ఒకరికి జీవిత ఖైదు, జరిమానా

వరంగల్ లీగల్, ఏప్రిల్ 15: పాత కక్షలు దృష్టిలో పెట్టుకొని ఒకరిని అతిదారుణంగా హత్యచేసిన వ్యక్తిపై నేరం రుజువైనందున యావజ్జీవ కారాగార శిక్ష రూ.5వేల జరిమానా విధిస్తూ హనుమకొండ జిల్లా ప్రధాన సెషన్స్ జడ్జి ఎం.కృష్ణమూర్తి సోమవారం తీర్పు చెప్పారు. కేసు వివరాలు ఈ విధంగా ఉన్నాయి.

హనుమకొండ జిల్లా కాజీపేట మండలం రాంపేట గ్రామానికి చెందిన అలువుల సమ్మయ్యకు అదే గ్రామానికి చెందిన దడబోయిన శంకరయ్యకు చిన్నచిన్న తగాదాలు ఉండేవి. రెండేళ్ల కిందట అలువుల సమ్మయ్య.. శంకరయ్యపై దాడి చేయడంతో మడికొండ పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది. అప్పటి నుంచి ఇద్దరి మధ్య తరచూ గొడవలు జరుగుతుండేవి. పాతకక్షలు మనసులో పెట్టుకొని 2021జూలై 10న ఎప్పటిలాగా అలువుల సమ్మయ్య ఉదయం సమయంలో మన వడితో కలిసి యోగా, వాకింగ్ చేయడానికి వెళ్లాడు. ఇది గమనించిన శంకరయ్య యోగా చేస్తున్న సమ్మయ్యపై గొడ్డలితో దాడి చేయడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈవిషయాన్ని అదేగ్రామానికి చెందిన కట్ట వీరారెడ్డి.. సమ్మయ్య భార్యకు తెలపడంతో హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుంది. అనంతరం తన భర్త అలువుల సమ్మయ్యపై దాడి చేసి కిరాతకంగా చంపిన దడబోయిన శంకరయ్యపై మడికొండ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఫిర్యాదు స్వీకరించిన పోలీసులు నిందితుడు శంకరయ్యపై హత్యానేరం కేసు నమోదు చేశారు. కేసు విచారణలో నేరం రుజువైనందున నిందితుడికి జీవిత ఖైదు, రూ.5వేల జరిమానా విధిస్తూ న్యాయ మూర్తి తీర్పు వెలువరించారు. కోర్టు పీసీ వి.రాజేష్ సాక్షులను ప్రవేశపెట్టగా మంతెన రవికుమార్, డి.ప్రతాప్ దర్యాప్తు అధికారులుగా వ్యవహరించారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎం.సత్యనారాయణ కేసు వాదించారు.

కేజీబీవీ విద్యార్థినులకు ఎప్‌సెట్ కోచింగ్

ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా 154 మంది విద్యార్థులకు షార్ట్ టర్మ్ కోచింగ్

ర్యాంకులే లక్ష్యంగా హసన్‌పర్తి కేజీబీవీలో నెల పాటు సాగనున్న ఉచిత శిక్షణ


హసన్‌పర్తి కేజీబీవీ ఎప్‌సెట్ కోచింగ్ సెంటర్‌లో తరగతులు

వరంగల్ ఎడ్యుకేషన్, ఏప్రిల్ 12: కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో (కేజీబీవీ) చదువుకుంటున్న విద్యార్థినులకు ఇకనుంచి ఎప్‌సెట్ (ఇంజనీరింగ్ అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ)లో ర్యాంకుల పంట పండనుంది. ఇందుకోసం ఈ ఏడాది నుంచి ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికన కేజీబీవీల్లో ఎప్‌సెట్ షార్ట్ టర్మ్ కోచింగ్‌ను నెల పాటు ప్రభుత్వం అందిస్తుంది. దీంతో ర్యాంకుల సాధనలో ప్రైవేటు, ప్రతిభ గురుకుల జూనియర్ కళాశాలల సరసన కేజీబీవీలు చేరనున్నాయి. ఉమ్మడి వరంగల్ జిల్లావ్యాప్తంగా కేజీబీవీల్లో ఈ విద్యా సంవత్సరం ఇంటర్మీడియెట్ రెండో సంవత్సరం పరీక్షలు రాసిన 154 మంది విద్యార్థులను ఎంపిక చేసి హనుమకొండ జిల్లాలోని హసన్‌పర్తి కేజీబీవీలో నెల పాటు ఉచితంగా వసతులతో కూడిన ఎప్‌సెట్ ఫ్రీ షార్ట్ టర్మ్ కోచింగ్ అందిస్తున్నారు. ఏప్రిల్ 1న ప్రారంభమైన ఈ కోచింగ్ మే 1తో ముగియనుంది.

విద్యార్థులకు వరం

ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం కేజీబీవీల్లో చదువుతున్న విద్యార్థినులకు వరంగా మారింది. ఈ ఏడాది నుంచి కేజీబీవీల్లో ఇంటర్ విద్య పూర్తి చేసిన వారికి అదే ఏడాది ఎప్‌సెట్‌కు నెల రోజుల పాటు షార్ట్ టర్మ్ కోచింగ్ ఇవ్వడంపై కేజీబీవీల విద్యార్థినులు ప్రైవేటు, ఆదర్శ గురుకుల జూనియర్ కళాశాలల పక్కన చేరనున్నాయి. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని వరంగల్, హనుమకొండ, జనగామ, జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లాలోని కేజీబీవీల్లో చదువుతున్న 154మంది విద్యార్థినులకు హసన్‌పర్తి కేజీబీవీలో ఏప్రిల్ 1 నుంచి ఎప్‌సెట్ కోచింగ్ క్యాంపు ప్రారంభమైంది. అన్ని వసతులతో కూడిన ఉచిత శిక్షణను ఇక్కడ నెల రోజుల పాటు అందించనున్నారు.

నిష్ణాతులైన అధ్యాపక బృందం

ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా కేజీబీవీల్లో బోధిస్తున్న పీజీసీఆర్‌టీల్లో మెరికలైన వారిని ఎంపిక చేసి వారితో విద్యార్థినులకు కోచింగ్ ఇస్తున్నారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిరంతరాయంగా కోచింగ్ తరగతులు నిర్వహిస్తున్నారు. ఎంసీపీ, బైపీసీ ద్వితీయ సంవత్సరం పరీక్షలు రాసిన విద్యార్థినులకు ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ తదితర విభాగాల్లో సీట్లు సాధించేందుకు తర్ఫీదు ఇస్తున్నారు. ప్రతీ విద్యార్థినిపై దృష్టిపెట్టి కోచింగ్ సాగుతోంది. కోచింగ్‌తో పాటు స్టడీ మెటీరియల్ పంపిణీ చేస్తున్నారు. సబ్జెక్టుల్లో టాపిక్‌లు పూర్తి కాగానే అందులో విద్యార్థుల టెస్ట్‌లు నిర్వహిస్తూ పూర్తిగా కార్పొరేట్ స్థాయిలో కోచింగ్ నిర్వహిస్తున్నారు. ఈ కోచింగ్ సఫలీకృతమైతే కేజీబీవీ విద్యార్థులకు ఎప్‌సెట్‌లో ర్యాంకుల పంట పండనుంది.

జిల్లాల వారీగా విద్యార్థినులు సంఖ్య

ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా మొత్తం 154 మంది విద్యార్థినులను ఎంపిక చేసి కోచింగ్ ఇస్తున్నారు. వరంగల్ జిల్లాలో 10 కేజీబీవీల నుంచి 10 మంది విద్యార్థినులు, హనుమకొండలో 9 కేజీబీవీల నుంచి 90 మంది, జనగామలోని 12 కేజీబీవీల నుంచి 14 మంది, ములుగులోని 9 కేజీబీవీల నుంచి 12 మంది, జయశంకర్ భూపాలపల్లిలోని 10 కేజీబీవీల నుంచి 18 మంది విద్యార్థినులు మొత్తం 154 మంది విద్యార్థినులు ఈ కోచింగ్ సెంటర్‌లో ఎప్‌సెట్‌కు ప్రత్యేకమైన శిక్షణ తీసుకుంటున్నారు.

విద్యార్థినులు సద్వినియోగం చేసుకోవాలి

డాక్టర్ ఎండి. అబ్దుల్‌హై, హనుమకొండ డీఈవో



ప్రభుత్వం కేజీబీవీ విద్యార్థినుల కోసం మంచి కార్యక్రమం చేపట్టింది. విద్యార్థినులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. అధ్యాపకులు బోధిస్తున్న విషయాలను నేర్చుకొని అనుమానాలను నివృత్తి చేసుకోవాలి. ఎలాంటి ఒత్తిడులకు గురికాకుండా నెల రోజుల పాటు కష్టపడితే ఎప్‌సెట్‌లో మంచి ర్యాంకు సాధించి వారు కోరుకున్న కళాశాలలో సీటు సాధించే అవకాశం ఉంది. నిబద్ధతతో అధ్యాపకులు విద్యాబోధన చేస్తున్నారు. నెల రోజుల పాటు నిర్వహిస్తున్న ఈ షార్ట్ టర్మ్ ఎప్‌సెట్ కోచింగ్‌తో విద్యార్థినులు ర్యాంకులు సాధించే అవకాశం ఉంది.



ప్రణాళికాబద్ధంగా శిక్షణ సాగుతోంది..

సముద్రాల సునిత, జీసీడీవో, హనుమకొండ



ప్రభుత్వ ఆదేశాల మేరకు డీఈవో ఆధ్వర్యంలో ఏప్రిల్ 1న హసన్‌పర్తిలోని కేజీబీవీలో కోచింగ్ సెంటర్‌ను ప్రారంభించాం. నెల రోజులకు ప్రణాళికలను రూపొందించుకొని విద్యార్థినులకు కోచింగ్ ఇస్తున్నాం. నిరంతరం పర్యవేక్షిస్తూ, కోచింగ్ క్యాంపు ఎస్‌వో, అధ్యాపకులను సమన్వయం చేస్తూ కోచింగ్ నిర్వహిస్తున్నాం. పేద విద్యార్థినులకు ఎప్‌సెట్‌లో ర్యాంకులు సాధించే విధంగా ప్రభుత్వం ఈ ఏడాది ప్రవేశపెట్టిన కోచింగ్ సెంటర్‌లో లక్ష్యాలను సాధించేందుకు కృషి చేస్తున్నాం. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని కేజీబీవీల్లో పనిచేస్తున్న నిష్ణాతులైన పీజీసీఆర్‌టీలు కార్పొరేట్ స్థాయిలో సబ్జెక్టులను బోధిస్తున్నారు. బోధన తరగతులతో పాటు స్టడీ అవర్స్ నిర్వహిస్తున్నాం. మే 1 తో శిక్షణ ముగుస్తుంది. ఈ కోచింగ్ సెంటర్ నుంచి చాలా మంది విద్యార్థులు మంచి ర్యాంకులు సాధిస్తారని ఆశిస్తున్నాం.

ర్యాంక్ సాధిస్తా..

ఎన్. శైలజ, వెంకటాపూర్ కేజీబీవీ, ములుగు



షార్ట్ టర్మ్ కోచింగ్‌తో ఎప్‌సెట్‌లో మంచి ర్యాంకు సాధిస్తా. అధ్యాపకులు అద్భుతంగా బోధిస్తున్నారు. మంచి ఇంజనీరింగ్ కళాశాలలో సీటు సాధిస్తాను. కోచింగ్ సెంటర్‌లో వసతులు బాగానే ఉన్నాయి. ఎలాంటి ఇబ్బందులు లేకుండా చదుకునేందుకు అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేశారు.

అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటా..

ఎం.బేబి, పాలకుర్తి కేజీబీవీ, జనగామ జిల్లా



కేజీబీవీల్లో ఈ ఏడాది ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు రాసిన విద్యార్థులకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన షార్ట్ టర్మ్ ఎప్‌సెట్ కోచింగ్‌ను సద్వినియోగం చేసుకుంటాను. ఈ నెల రోజుల పాటు లెక్చరర్లు బోధిస్తున్న పాఠ్యాంశాలను శ్రద్ధగా చదువుతూ మంచి ర్యాంకు సాధిస్తాను. ఇక్కడి కోచింగ్ సెంటర్‌లో అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేశారు. లెక్చరర్లు అందరూ బాగా బోధిస్తున్నారు.

మే 1నుంచి వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు

వరంగల్ స్పోర్ట్స్, ఏప్రిల్15: తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ (సాట్) ఆదేశాల మేరకు జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ (డీఎస్ఏ) ఆధ్వర్యంలో మే 1నుంచి 31వ తేదీ వరకు వేసవి క్రీడా శిక్షణ శిబిరాలను నిర్వహించనున్నట్లు జిల్లా క్రీడల అధికారి అశోక్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో శిక్షణ పొందేందుకు 4వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు చదువుతున్న బాల బాలికలు అర్హులని పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంతో పాటు ఇతర క్రీడా మైదానాలలో పలు క్రీడాంశాలలో అనుభవజ్ఞులైన కోచ్‌ల ద్వారా నామమాత్రపు ఫీజు (పేఅండ్‌ప్లే) పద్ధతిన నెల పాటు శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. అదే విధంగా మండల, గ్రామీణ ప్రాంతాలలో నిర్వహించనున్న క్రీడా శిక్షణ శిబిరాలను ఉచితంగా నిర్వహిస్తామన్నారు. గ్రామీణ ప్రాంతాలో క్రీడా శిబిరాలను నిర్వహించేందుకు పీడీ, పీఈటీ లేదా సీనియర్ క్రీడాకారులు ఈ నెల 25వరకు హనుమకొండ జేఎన్ ఇండోర్ స్టేడియంలోని డీఎస్ఏ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని ఆయన వెల్లడించారు. మరిన్ని వివరాల కోసం 9392997668 నెంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

వరంగల్ లోక్‌సభ ఎన్నిక ఓబీసీ ఇన్‌చార్జ్‌ల నియామకం

హనుమకొండ సిటీ, ఏప్రిల్ 15: వరంగల్ లోక్‌సభ ఎన్నికలో భాగంగా ఓబీసీ సెల్ నాయకులను ఇన్‌చార్జిలుగా నియమిస్తూ టీపీసీసీ ఓబీసీ సెల్ రాష్ట్ర చైర్మన్ నూతి శ్రీకాంత్‌గౌడ్ ప్రకటించారు. ఇన్‌చార్జిగా నియమితులైన వారిలో ఓబీసీ సెల్ జిల్లా చైర్మన్ బొమ్మతి విక్రమ్ ముదిరాజ్, స్టేట్ కో-ఆర్డినేటర్ సంధుపట్ల ధన్‌రాజ్, జాయింట్ కో-ఆర్డినేటర్లు బండారి జనార్దన్‌గౌడ్, పులి గణేశ్ ఉన్నారు. లోక్‌సభ ఎన్నికలో పార్టీ అభ్యర్థి డాక్టరు కడియం కావ్య గెలుపు కోసం వీరు బాధ్యతలను నిర్వహించనున్నారు.

నవజాత శిశువు మృతదేహం లభ్యం


చెరువులో లభ్యమైన శిశువు మృతదేహం

ఎల్కతుర్తి, ఏప్రిల్ 15: ఎల్కతుర్తి మండలంలోని గోపాల్‌పూర్ గ్రామ చెరువులో సోమవారం ఓ నవజాత మగ శిశువు శవం లభ్యమైంది. గ్రామ శివారులోగల చెరువులో నవజాత శిశువు శవం కనిపించడంతో గ్రామస్తులు భారీగా వెళ్లి చూశారు. దీంతో సమాచారం తెలుసుకున్న స్థానిక పోలీసులు సంఘటనా స్థలానికి తరలివెళ్లి పరిశీలించారు. శిశువు చేతులకు చికిత్సకు సంబంధించిన ప్లాస్టర్ వేసి ఉన్నాయి. దీంతో ఏవరో ఆస్పత్రి నుంచి తీసుకొచ్చి చెరువులో వేసి ఉంటారని గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేశారు. శిశువు ఎండతాకిడికి తట్టుకోలేక మృతి చెంది ఉంటుందని గ్రామస్థులు అనుమానం వ్యక్తం చేశారు. పోలీసులు పలు కోణాలలో ఆరా తీస్తున్నారు.

ప్రజలను ఓటడిగే హక్కు కోల్పోయిన కేసీఆర్

తెలంగాణ ఉద్యమకారుల చైర్మన్ కూరపాటి వెంకట నారాయణ


సమావేశంలో మాట్లాడుతున్న వెంకటనారాయణ

కాజీపేట జంక్షన్, ఏప్రిల్ 15: ప్రజలు నమ్మి అధికారం ఇస్తే రాష్ట్రాన్ని సర్వనాశనం చేసి అధికారం కోల్పోయిన కేసీఆర్ ప్రస్తుతం బలమైన ప్రతిపక్షం ఉండాలని ప్రజలకు హితబోధ చేస్తున్నారని తెలంగాణ ఉద్యమకారుల చైర్మన్ ప్రొఫెసర్ కూరపాటి వెంకట నారాయణ అన్నారు. సోమవారం హనుమకొండ బాలసముద్రంలోని తన స్వగృహంలో ఉద్యమకారులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేసీఆర్ తెలంగాణ ప్రజలను ఓటు అడిగే హక్కును కోల్పోయిన విషయాన్ని మర్చిపోతున్నాడని ఆయన అన్నారు. బీఆర్ఎస్ పార్టీకి ఎవరూ ఓటు వేయవద్దని, ఆ పార్టీ అభ్యర్థిని కూడా గెలవకుండా చూడాల్సిన అవసరం ఉందని తెలంగాణ ఉద్యమకారులకు ఆయన పిలుపునిచ్చారు. దశాబ్దకాలంలో ప్రజల గొంతుకలైన ప్రతిపక్షాలను చీల్చి బ్లాక్‌మెయిల్ చేసి తాయిలాలు ఇచ్చి నాయకులకు దోపిడీ చేయడానికి అవకాశం కల్పించి ప్రజల భూములను, ప్రభుత్వ ఖజానాను కొల్లగొట్టి చరిత్ర సృష్టించారని ఆయన పేర్కొన్నారు.

కుమార్తె లిక్కర్ స్కాంలో జైలుపాలైందని, వారి కుటుంబానికి దగ్గరి బంధువులకు, అధికారులకు అందినంత దోపిడీ చేసుకోవడానికి అవకాశాలు ఇచ్చి విధ్వంసం సృష్టించారని ప్రజలు ఇటీవల జరిగిన ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పి ప్రగతి భవన్ నుంచి గెంటివేశారని ఆయన ఎద్దేవా చేశారు. విద్యాసంస్థలను నిర్వీర్యం చేసి బహుజన వర్గాలను అణచివేసిన కల్వకుంట్ల కుటుంబాన్ని ప్రజలు రాజకీయంగా బొందపెట్టాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో అభ్యర్థులను నిలబెట్టి ప్రజలను మోసంగించే మాటలు చెప్పి పార్టీని బతికించుకొని ఆస్తులను కాపాడుకోవడానికి కేసీఆర్ బస్సు యాత్రలు, రోడ్‌షోలు సిగ్గుపడకుండా కొనసాగిస్తున్నాడని అన్నారు. గత ప్రభుత్వం చేసిన అప్పులకు నెలకు సుమారు రూ.25వేల కోట్ల వడ్డీలు కట్టవలసిన దుస్థితి ఏర్పడిందన్నారు. ప్రస్తుత ప్రభుత్వానికి మరో ఆరునెలల కాలం నుంచి పథకాలు అమలు చేయడానికి అవకాశం ఇవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. ఈ క్లిష్టమైన సమయంలో ప్రజలు తమ ఓటును దోపిడీదారులకు వేయకుండా జాగ్రత్తపడా లని ఆయన విజ్ఞప్తి చేశారు. సమావేశంలో ఇంకా ఉద్యమకారులు డాక్టర్ కె. వీరస్వామి, చింతకింది కుమారస్వామి పాల్గొన్నారు.

వడ్డీ మాఫియా!

(5వ పేజీ తరువాయి)

ప్రాంతంలో ఇద్దరు కార్పొరేటర్లు, మరో పది మంది చోటామోటా లీడర్లు ఈ ఫైనాన్స్ దందాలో ఉన్నారని, వీరికి రాజకీయ నేతల అండదండలతో పాటు పోలీసులు సహకారం ఉందనే ప్రచారం జరుగుతోంది. కొందరు ఖాకీలు కూడా ఫైనాన్స్‌లో భాగస్వాములుగా ఉన్నారని, దీంతో అధిక వడ్డీల దందా మూడు పువ్వులు ఆరు కాయాలు చందంగా సాగుతోందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అలాగే జనగామ జిల్లాలో జనగామ, స్టేషన్‌ఘనపూర్, వరంగల్ జిల్లా నర్సంపేట, వర్ధన్నపేట, హనుమకొండ జిల్లా పరకాల, కమలాపూర్ ప్రాంతాల్లో భారీగా అక్రమ ఫైనాన్స్ దందా సాగుతోంది. అయితే వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో జరుగుతున్న గిరిగిరి దందాలో రాజకీయ నేతలతో పాటు కొన్ని ప్రాంతాల్లో ప్రభుత్వ, ప్రైవేట్ టీచర్లు కూడా ప్రముఖంగా ఉన్నట్లు సమాచారం. రియల్ ఎస్టేట్ వ్యాపారం కుదేలవడంతో చాలా మంది రియల్టర్లు కూడా అధిక వడ్డీ వ్యాపారంలోకి అడుగు పెడుతున్నారు. లక్ష పెట్టుబడి పెడితే సంవత్సరం తిరుగక ముందే లక్ష రుపాయలు వడ్డీ వస్తుండటంతో కోట్లాది రుపాయలను వడ్డీ వ్యాపారంలో పెట్టి పేదలను జలగల్లా పీడిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎలాంటి అనుమతులు లేకుండా జరుగుతున్న ఈ అధిక వడ్డీ వ్యాపారంపై పోలీసులకు ఫిర్యాదుల అందిన పట్టించుకోవటం లేదనే ఆరోపణలున్నాయి. ఎదైనా సంఘటన జరిగినప్పుడే హడావిడి చేసి చేతులు దులుపుకోవటం మినహా పోలీసులు చేసేదేమీ ఉండదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.


కేటీఆర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న సుధీర్‌కుమార్

కేటీఆర్‌ను కలిసిన సుధీర్‌కుమార్

రాంనగర్, ఏప్రిల్ 15: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను వరంగల్ లోక్‌సభ అభ్యర్థి మారెపెల్లి సుధీర్‌కుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు. సోమవారం హైదరాబాద్‌లో కేటీఆర్‌ను కలిసి తనకు అవకాశం ఇచ్చినందుకు సుధీర్‌కుమార్ కృతజ్ఞతలు తెలిపారు. కేటీఆర్‌ను కలిసిన వారిలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్, ఎమ్మెల్సీలు మధుసూధనాచారి, శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, నేతలు వినయభాస్కర్, రాజయ్య, గండ్ర వెంకటరమణారెడ్డి, నన్నపునేని నరేందర్, పెద్ది సుదర్శన్‌రెడ్డి, చల్లా ధర్మారెడ్డి తదితరులున్నారు.

మార్కెట్లో మరింత తగ్గిన మిర్చి ధరలు

వరంగల్ వ్యవసాయం, ఏప్రిల్ 15: ఏనుమాముల వ్యవసాయ మార్కెట్లో మిర్చి ధరలు మరింత తగ్గాయి. ఈనెల 5న పలికిన ధరలకు సోమవారం పలికిన ధరకు చాలా తేడా ఉంది. వరుస సెలవుల రావడంతోపాటు రోజురోజుకూ ధరలు పతనమవుతుండడంతో రైతులు తమ దగ్గర ఉన్న మిర్చి పంటను వెంటనే అమ్ముకునేందుకు మార్కెట్‌కు తరలిస్తున్నారు. దీంతో మార్కెట్‌కు మిర్చి బస్తాలు పోటెత్తుతున్నాయి. మిర్చి పెద్దఎత్తున రావడంతో ధరలు పడిపోతున్నాయని వ్యాపార వర్గాలు చెపుతున్నాయి. .

మిర్చి ధర క్వింటాల్లో...

రకం	మార్చి 6న	ఏప్రిల్ 10న	ఏప్రిల్ 15న
తేజ రకం	రూ.20,300	రూ.19,000	రూ.18,300
వండర్‌హాట్	రూ.19,500	రూ.15,500	రూ.15,000
యుఎస్ 341	రూ.18,000	రూ.15,200	రూ.15,500
దేశీ	రూ.38,000	రూ.26,000	రూ.27,000
సింగిల్‌పట్టి	రూ.42,500	రూ.43,500	రూ.30,000
తాలు	రూ.8,500	రూ.7,000	రూ.7,000

కాంగ్రెస్‌లో చేరిన పొట్లపల్లి



ఇందిరకు పుష్పగుచ్ఛం అందిస్తున్న పొట్లపల్లి శ్రీధర్‌రావు

చిలుపూర్, ఏప్రిల్ 15: మండలంలోని పల్లగుట్టకు చెందిన బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ కోఆర్డినేటర్, చిలుపూర్ గుట్ట దేవస్థానం మాజీ ఛైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. సోమవారం స్టేషన్‌ఘన్‌పూర్‌లో జరిగిన కార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సింగపురం ఇందిర సమక్షంలో ఆయన కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. ఆయనతో పాటు చిలుపూర్ ఎంపీపీ బొమ్మిశెట్టి సరిత -బాలరాజు, పీఏసీఎస్ వైస్ ఛైర్మన్ చిర్ర నాగరాజు, మాజీ సర్పంచులు మామిడాల లింగారెడ్డి, భూక్య సుధాకర్‌నాయక్, కర్ణకంటి స్వప్నవెంకటేశ్, కొయ్యడ రాందాస్, సోషల్ మీడియా నియోజకవర్గ ఇన్‌చార్జి రంగు రమేష్, గడ్డమీది వెంకటస్వామి, ఇల్లందుల హరిబాబు, తాళ్ళపల్లి రాజ్‌కుమార్ తదితరులు కాంగ్రెస్ పార్టీలో చేరారు.

కాంగ్రెస్‌లో చేరికలు



కాంగ్రెస్‌లో చేరిన వివిధ పార్టీల నాయకులు

కొడకండ్ల, ఏప్రిల్ 15 : మండలంలోని పాకాల గ్రామ మాజీ సర్పంచ్ జాజుల శ్రీలేఖతో పాటు మొండ్రాయి, బోడోనికుంట తండాల నుంచి భారీ సంఖ్యలో పలు పార్టీల నాయకులు సోమవారం కాంగ్రెస్‌లో చేరారు. మహబూబాబాద్ జిల్లా తొర్రూరులోని పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి ఝాన్సీరెడ్డి సమక్షంలో పార్టీ కండువా కప్పుకున్నారు. వారిలో నరేష్ పవార్, బాలు జాదవ్, రమేష్, స్మిత పవార్, బానోత్ అనిత, సరిత, సునీత, కిషోర్, కిషన్, జూనియర్ రెడ్డి నాయక్, రాంకోటి తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ అధ్యక్షుడు ఇ.సురేష్ నాయక్, నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాజేష్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

'మొక్కలు ఎండితే చర్యలు'

బచ్చన్నపేట, ఏప్రిల్ 15: పల్లె ప్రకృతి వనాల్లో నాటిన మొక్కలను కాపాడాల్సిన బాధ్యత గ్రామ పంచాయతీలపై ఉందని ఎంపీడీవో రఘురామకృష్ణ అన్నారు. సోమవారం మండలంలోని బసిరెడ్డిపల్లి గ్రామంలో పల్లె ప్రకృతి వనం, గ్రామ నర్సరీని పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఎండ తీవ్రత అధికంగా ఉండటం చేత, నాటిన మొక్కలు ఎండిపోతున్నాయని, ట్యాంకర్ల ద్వారా నీటి తడులు అందించే ఏర్పాట్లు చేయాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు.

వెన్నుపోటు రాజకీయాలకు కేరాఫ్ కడియం

- మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య

స్టేషన్‌ఘన్‌పూర్, ఏప్రిల్ 15: వెన్నుపోటు రాజకీయాలకు కేరాఫ్ కడియం శ్రీహరి అని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య విమర్శించారు. నాడు టీడీపీలో ఉన్న సమయంలో ఎన్టీఆర్‌కు, నేడు బీఆర్ఎస్‌లో కేసీఆర్‌కు వెన్నుపోటు పొడిచిన నమ్మకద్రోహి అని మండిపడ్డారు. సోమవారం డివిజన్ కేంద్రంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కేసీఆర్ తనకు ఎంపీ టికెట్ ఇస్తానని చెప్పిన క్రమంలో కడియం బ్లాక్‌మెయిల్ చేసి బిడ్డకు టికెట్ తెచ్చుకున్నాడని ఆరోపించారు. నిత్యం నీతి నిజాయితీ గురించి మాట్లాడే కడియం బిడ్డకు ఎంపీ టికెట్‌తో పాటు పార్టీ ఫండ్ తీసుకొని, మళ్లీ కేటీఆర్‌తో పాటు ఇతర నాయకుల వద్ద డబ్బులు అడుక్కొని, అనంతరం కాంగ్రెస్‌లో చేరాడని అన్నారు. 600 జనాభాతో 429 ఓట్లు మాత్రమే ఉన్న బైండ్ల జాతికి చెందిన వ్యక్తి కడియం అని గుర్తు చేశారు. ఆయనను ఎమ్మెల్యేను చేసి, ఆయన బిడ్డకు ఎంపీ టికెట్ ఇస్తే కేసీఆర్‌కు వెన్నుపోటు పొడిచి పార్టీ మారాడని అన్నారు. మాదిగలకు అన్యాయం చేసిన పార్టీగా కాంగ్రెస్ చరిత్రలో నిలిచిపోతుందని అన్నారు. కడియం కావ్యకు ఆ పార్టీ టికెట్ ఇవ్వడం సిగ్గుచేటు అన్నారు. తెలంగాణలోని మాదగలందరు కాంగ్రెస్ పైన వ్యతిరేకతతో ఉన్నారన్నారు. ఘన్‌పూర్ నియోజకవర్గంలో 35శాతం మంది మాదిగలు ఉన్నారని గుర్తు చేశారు. కడియం కావ్య ఇప్పటికే ఓడిపోయిందని జోస్యం చెప్పారు.

ప్రస్తుతం కడియం జుట్టు బిడ్డ కావ్య చేతిలో ఉందని, త్వరలోనే వివరాలు చెబుతానని, కడియం సంపాదించిన డబ్బులు విదేశాల్లో దాచుకునే క్రమంలో బిడ్డ మొదటి సాక్షిగా, అల్లుడు రెండవ సాక్షిగా ఉన్నారని తెలిపారు. ఎన్నో సార్లు కడియం ఇంట్లో రాజకీయ వారసత్వంపై గొడవలు జరిగాయన్నారు. ఇప్పటికే కడియం కులంపై వివాదం కొనసాగుతోందని, ఆయన రిజర్వేషన్‌కు అర్హుడే కాదనే చర్చ జరుగుతోందని అన్నారు. మతాంతర వివాహం చేసుకున్న కావ్యది ఎస్సీ కులమే కాదన్నారు. నేడు సభ్యసమాజం సిగ్గుపడేలా కడియం శ్రీహరి రాజకీయాలు ఉన్నాయన్నారు. తండ్రీబిడ్డలకు ప్రజలు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. కడియంకు సిగ్గుశరం ఉంటే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి చేతి గుర్తుపైన గెలిస్తే ప్రజలు హర్షిస్తారని హితవు పలికారు. తాను తెలంగాణ ఉద్యమం కోసం అధికారి పార్టీకి రాజీనామా చేసి బీఆర్ఎస్‌లో చేరి గెలిచానని, దమ్ముంటే ఆయన కూడా ఆపని చేసి రావాలని సవాల్ చేశారు. రైతు బంధు ఛైర్మన్ పదవి పోయి, ఎంపీ టికెట్ రావడం లేదని తెలిసి తాను ఫిబ్రవరిలో బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించానని తెలిపారు. పార్టీకి రాజీనామా చేసినప్పటికీ కేసీఆర్ తన రాజీనామాను ఆమోదించలేదని గుర్తుచేశారు. కేసీఆర్ తనకు నియోజకవర్గ బాధ్యతలు అప్పగించారని, ఎంపీ ఎన్నికల్లో ఘన్‌పూర్ నుంచి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి సుధీర్‌కుమార్‌కు అధిక మెజార్టీ తీసుకువచ్చేలా పని చేయాలని శ్రేణులకు పిలుపునిచ్చారు. ఘన్‌పూర్‌లో బీఆర్ఎస్‌కు పూర్వ వైభవం తీసుకువస్తానని తెలిపారు.

కార్యక్రమంలో నాయకులు ఆకుల కుమార్, మాచర్ల గణేష్, మహేందర్ రెడ్డి, తాటికొండ సురేష్, పొన్నం రంజిత్‌కుమార్, చందర్ రెడ్డి, ఒగ్గు రాజు, కనకం గణేష్, లకావత్ చిరంజీవి, కుంభం కుమార్, అక్కినపల్లి బాలరాజు, బత్తుల రాజన్‌బాబు, మైపాషా, తదితరులు పాల్గొన్నారు.

వర్ధన్నపేటలో చెల్లని రూపాయి ఘన్‌పూర్‌లో చెల్లుతుందా

- బీజేపీ ఎంపీ అభ్యర్థి అరూరిని ఉద్దేశించి ఎమ్మెల్యే కడియం వ్యాఖ్యలు



స్టేషన్‌ఘన్‌పూర్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి, పక్కన కడియం కావ్య

స్టేషన్‌ఘన్‌పూర్, ఏప్రిల్ 15: వర్ధన్నపేటలో చెల్లని రూపాయి స్టేషన్‌ఘన్‌పూర్‌లో చెల్లుతుందా అని బీజేపీ అభ్యర్థి అరూరి రమేష్‌ను ఉద్దేశించి ఎమ్మెల్యే కడియం శ్రీహరి వ్యాఖ్యానించారు. సోమవారం సాయంత్రం ఘన్‌పూర్‌లో ఏర్పాటు చేసిన కాంగ్రెస్ పార్టీ ఘన్‌పూర్, చిలుపూరు మండలాల కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. వర్ధన్నపేట నియోజకవర్గం పరిధిలో అనేక మంది రైతుల భూములను లాక్కొని అక్కడి ప్రజలను ఇబ్బందులకు గురి చేసినందునే అరూరిని ఓడించారని అన్నారు. కడియం కావ్య లోకల్ కాదని కొందరు మాట్లాడడం సిగ్గుచేటు అన్నారు. ఇక్కడే చదువుకొని, ఇక్కడే ఉద్యోగం చేస్తున్న కావ్య పక్కా లోకల్ అని తెలిపారు. బీజేపీని ఆదరిస్తే దళితుల, బడుగు బలహీన వర్గాల బతుకులు ఆగమైపోతాయని అన్నారు. స్టేషన్‌ఘన్‌పూర్ నుంచి బీఆర్ఎస్ కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరుతున్నారని, అప్పటికే సుమారు 70శాతం చేరారని అన్నారు. గ్రామాలలో ఏర్పాటు చేయనున్న ఇందిరమ్మ కమిటీల్లో పార్టీ గెలుపు కోసం పనిచేసిన వారికే అవకాశాలు కల్పిస్తామని అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వలంటీర్ల మాదిరిగా ఇక్కడ ఇందిరమ్మ కమిటీ లను నయమించి సభ్యులకు గౌరవ వేతనాలు ఇచ్చేఅవకాశం ఉందని అన్నారు. కార్యక్రమంలో పార్టీ వరంగల్ పార్లమెంట్ అభ్యర్థి కడియం కావ్య, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సింగపురం ఇందిర, రాష్ట్ర అబ్జర్వర్ వెంకట్ రెడ్డి, నాయకులు జగదీష్‌చందర్ రెడ్డి, జూలకుంట్ల శిరీష్ రెడ్డి, బెలిదె వెంకన్న, తోట వెంకన్న, నరేందర్ రెడ్డి, శ్రీధర్‌రావు, గడ్డమీది సురేష్, వెంకటేశ్వర్ రెడ్డి, కొలిపాక సతీష్, ఎంపీపీలు బొమ్మిశెట్టి సరిత, కందుల రేఖ-గట్టయ్య, నాయకులు భూక్య సుధాకర్‌నాయక్, బూర్ల శంకర్, నాగరబోయిన యాదగిరి, తెల్లాకుల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కొనుగోళ్లను వేగవంతం చేయాలి

- నిర్వాహకులకు అడిషనల్ కలెక్టర్ రోహిత్‌సింగ్ ఆదేశాలు



తిమ్మంపేటలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్ రోహిత్‌సింగ్

జఫర్‌గఢ్, ఏప్రిల్ 15 : ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను వేగవంతం చేయాలని అడిషనల్ కలెక్టర్ రోహిత్‌సింగ్ ఆదేశించారు. సోమవారం ఆయన తిమ్మంపేటలో ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. ధాన్యం నిల్వలు, కొనుగోళ్ల ప్రక్రియ, వసతి సౌకర్యాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ధాన్యాన్ని పరిశీలించి వెంటవెంటనే వివరాలను నమోదు చేయాలన్నారు. బస్తాలను తూకం వేసి.. సంబంధిత మిల్లులకు తరలించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కేంద్రాల్లో బస్తాలు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. రైతులకు తాగునీటి వసతి, ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ అంబటి ఆంజనేయులు, ఎంఆర్ఐ అనిల్‌కుమార్, ఐకేపీ సిబ్బంది పాల్గొన్నారు.

స్టేషన్‌ఘన్‌పూర్: ధాన్యం కొనుగోళ్లలో నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదని అదనపు కలెక్టర్ రోహిత్ సింగ్ హెచ్చరించారు. సోమవారం ఆయన శివునిపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేశారు. నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. సెంటర్లకు రైతులు తీసుకువచ్చిన ధాన్యాన్ని వెంట వెంటనే కొనుగోలు చేయాలన్నారు. ఆ వెంటనే మిల్లులకు పంపించి ట్రాక్ షీట్స్‌ను ఆన్‌లైన్‌లో నమోదు చేయించి రైతులకు బిల్లులు త్వరగా పడేలా చూడాలన్నారు. ఇతరత్రా కారణాలను చూపి రైతులను ఇబ్బందులకు గురి చేయవద్దు అన్నారు. మండలంలో కేటాయించిన అన్ని కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఆర్ఐ అర్జున్, ఏపీఎం కుమార్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో నవగ్రహ విగ్రహాల ప్రతిష్ఠ



ఏడునూతులలో నవగ్రహాలను ప్రతిష్ఠిస్తున్న పండితులు

కొడకండ్ల, ఏప్రిల్ 15 : మండలంలోని ఏడునూతుల గ్రామంలో నవగ్రహాల విగ్రహ ప్రతిష్ఠను వేదపండితుడు గౌతం సిద్ధాంతి ఆధ్వర్యంలో వైభవోపేతంగా నిర్వహించారు. దాత నెల్లుట్ల కరుణ-సుధాకర్‌రావు దంపతుల సహకారంతో ఈ నెల 13వ తేదీన సాయంత్రం విష్వక్సేన ఆరాధనతో ప్రారంభమైన పూజలు సోమవారం యంత్ర ప్రతిష్ఠ, విగ్రహ ప్రతిష్ఠలతో పరిసమాప్తమయ్యాయని కార్యనిర్వాహకులు పాము లక్ష్మీనారాయణ తెలిపారు. ఈ కార్యక్రమంలో బేతోజు బ్రహ్మచారి, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

శివునిపల్లిలో నాలుగు చోట్ల
రాములోరి కల్యాణానికి ఏర్పాట్లు

స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్, ఏప్రిల్ 15: శ్రీ రామ నవమి సందర్భంగా ఈ నెల 17న శివునిపల్లి పట్టణంలో నాలుగు చోట్ల రాములోరి కల్యాణోత్సవం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. శివునిపల్లి నగరేశ్వరాలయంలో, శ్రీ వేంకటేశ్వరాలయంలో, రైల్వే స్టేషన్ వద్ద ఉన్న రామాలయంలో, శివునిపల్లి బొడ్రాయి వద్ద ఉన్న అంజనేయ స్వామి ఆలయంలో సీతా రాముల కల్యాణం ఉదయం 12 గంటలకు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. అనంతరం అన్నదానం ఏర్పాటు చేశామని తెలిపారు.

వైభవంగా శ్రీరామ విగ్రహ ప్రతిష్ఠ



రామవరంలో ప్రతిష్ఠించిన లక్ష్మణ సమేత శ్రీసీతారాముల విగ్రహాలు

కొడకండ్ల, ఏప్రిల్ 15 : మండలంలోని రామవరం గ్రామంలో శ్రీసీతా, లక్ష్మణ సహిత శ్రీరామచంద్రస్వాముల విగ్రహ ప్రతిష్ఠను వైభవోపేతంగా వేదపండితులు నిర్వహించారు. ఈ నెల 12వ తేదీన సాయంత్రం విష్వక్సేన ఆరాధనతో ప్రారంభమైన పూజలు సోమవారం యంత్ర ప్రతిష్ఠ, ధ్వజ ప్రతిష్ఠ, శిఖర ప్రతిష్ఠలతో పరిసమాప్తమయ్యాయని కార్యనిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో సింధె రామోజి, రాజిరెడ్డి, మణెమ్మ, శ్రీరాములు, శేఖర్, స్వామి, శిరీష, వెంకటేష్, మల్లేష్, పాల్గొన్నారు.

వల్మిడి ఆలయంలో కొనసాగుతున్న పూజలు



ఆలయంలో పూజలు చేస్తున్న పండితులు

పాలకుర్తి, ఏప్రిల్ 15:మండలంలోని వల్మిడిలోని శ్రీ సీత రామచంద్రస్వామి ఆలయంలో కల్యాణ మహోత్సవంలో భాగంగా సోమవారం మూడో రోజు సీతారామచంద్రస్వామి వారికి అభిషేకం, యాగశాల ప్రవేశం, అగ్ని ప్రతిష్ఠ కార్యక్రమాన్ని ఆలయ పూజారులు వైభవోపేతంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఈవో లక్ష్మీప్రసన్న, సూపరింటెండెంట్ వెంకటయ్య, శ్రీనివాస్, రాములు, మధు, అశోక్ ఉన్నారు.

పాత బీటు బజారులో అన్నదానం



అన్నదానం నిర్వహిస్తున్న కమిటీ సభ్యులు

జనగామ కల్చరల్, ఏప్రిల్ 15: శ్రీరామ నవమి పర్వదినాన్ని పురస్కరించుకొని ఈ నెల 17న సీతారామ కల్యాణం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. జిల్లా కేంద్రంలోని 27వ వార్డు పాతబీటు బజారులో 71వ శ్రీరామ నవరాత్రోత్సవాలను పురస్కరించుకొని బుధవారం సీతారామ కల్యాణం నిర్వహించనున్నారు. ఈ మేరకు సన్నాహక కార్యక్రమాలలో భాగంగా నిర్వహించిన అన్నదాన కార్యక్రమాన్ని బీజేపీ మునిసిపల్ ఫ్లోర్ లీడర్ మహంకాళి హరిశ్చంద్ర గుప్తా సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు సోమ హనుమంతరావు, అయితా శ్రీకాంత్ బచ్చు అశోక్, నందు బజాజ్, బుస్సా పాండు, గోవింద్ లోహియా, కందకూరి శ్రీనివాస్, హరిప్రసాద్ లోహియా, సత్తు, రామకృష్ణ, ఎర్రం ప్రసాద్, కాసం సురేష్, మారం ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

తెగిపడిన సర్వీస్ వైరు..

- షాక్‌తో ఎనిమిది మేకలు, దూడ మృత్యువాత



మృతి చెందిన మేకలు, దూడను చూపుతున్న బాధిత రైతు

బచ్చన్నపేట, ఏప్రిల్ 15: సుడిగాలి ప్రభావానికి కర్రపైనున్న సర్వీస్ వైరు జారి రేకులతో కప్పి ఉన్న మేకల షెడ్‌పై పడటంతో ఎనిమిది మేకలతో పాటు, పాడిగేదె దూడ మృత్యువాత పడ్డాయి. మండలంలోని కట్కూరు గ్రామానికి చెందిన బోయిని కనకయ్య అనే రైతు తన వ్యవసాయ బావి వద్ద మేకల కోసం రేకులతో షెడ్డు వేసి, చుట్టూ ఇనుపకంచెతో ఫెన్సింగ్ చేశాడు. పక్కనే ఉన్న స్తంభం నుంచి షెడ్డు మీదుగా సర్వీస్ వైరు బోరుకు కనెక్షన్ ఇచ్చారు. షెడ్డు పైభాగం తగలకుండా కర్రను పాతారు. ఆదివారం రాత్రి వీచిన సుడిగాలికి సర్వీస్‌వైరు ఎగిరి షెడ్‌పై పడటంతో వైరు తెగి విద్యుత్ సరఫరా అయ్యింది. దీంతో అందులో ఉన్న ఎనమిది మేకలతో పాటు, పాడిగేదె దూడ మృత్యువాత పడ్డాయి. ఈ సమయంలోనే ట్రాన్స్‌ఫార్మర్‌పై ఫ్యూజ్ వైరు కొట్టేయటంతో తెల్లవారుజామున పాలు పితికేందుకు బావి వద్దకు వచ్చిన రైతు కనకయ్య బతికిపోయాడు. లేకుంటే ప్రాణ నష్టం జరిగేదని గ్రామస్థులు తెలిపారు. బోరు వద్దకు వెళ్లే సర్వీస్ వైరును తొలగించాలంటే రెండు స్తంభాలు అవసరం పడుతాయి. వాటికి అధికారులు మంజూరు ఇప్పించటంతో పాటు, రైతును ఆదుకునే చర్యలు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు. పశువైద్యాధికారి రామారావు ఘటనాస్థలికి చేరుకుని పంచనామా నిర్వహించారు. మృతి చెందిన వాటి విలువ రూ. 1.50 లక్షలు ఉంటుందని బాధిత రైతు తెలిపాడు.

'కార్యకర్తలే పార్టీకి సుప్రీం'

స్టేషన్‌ఘన్‌పూర్, ఏప్రిల్ 15: కాంగ్రెస్ పార్టీకి కార్యకర్తలే సుప్రీం అని ఆ పార్టీ ఉమ్మడి వరంగల్ జిల్లా ఉపాధ్యక్షుడు కుందూరు వెంకట్ రెడ్డి అన్నారు. సోమవారం ఆయన ఛాగల్ గ్రామంలో మాట్లాడారు. పార్టీ కోసం నిజాయితీగా పనిచేసేవాళ్లు ఉన్నందు వల్లనే ఇన్ని ఏళ్లుగా పార్టీ మనుగడ సాధిస్తోందని అన్నారు. నాయకులు పదవుల కోసం వచ్చి వెళుతుంటారని, కార్యకర్తలు మాత్రం ప్రాణం ఉన్నంత వరకు పార్టీని పట్టుకొని ఉంటారని అన్నారు. కార్యకర్తలు తమకు పదవులు రాలేదని అధైర్యపడవద్దు అని, పార్టీ కోసం పని చేస్తున్నామనే భావనతో ముందుకు వెళ్లాల్సిన అవసరం ఉందని అన్నారు. గ్రామాల్లో క్యాడర్ బలంగా ఉన్నందువల్లనే మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ ఘన విజయం సాధించిందని అన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ మెజారిటీ స్థానాలు గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీఎస్పీలో చేరిన పంజా కల్పన

తొర్రూరు, ఏప్రిల్ 15: తొర్రూరు పట్టణానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకురాలు పంజా కల్పన తన అనుచరులతో సోమవారం బహుజన సమాజ్ పార్టీ (బీఎస్పీ)లో చేరారు. హైదరాబాద్‌లోని బీఎస్పీ రాష్ట్ర కార్యాలయంలో కోఆర్డినేటర్ బాలయ్య, రాష్ట్ర అధ్యక్షుడు మంద ప్రభాకర్ ఆధ్వర్యంలో ఆ పార్టీ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమసమాజ స్థాపన కేవలం బహుజన సమాజ్ పార్టీతోనే సాధ్యం అవుతుందన్నారు. ప్రజాహితం కోసం చేపట్టే ప్రజా కార్యక్రమాలను చూసి పార్టీలో చేరుతున్నారని అన్నారు. కాగా, బీఎస్పీ వరంగల్ ఎంపీ అభ్యర్థిగా పంజా కల్పనను ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా కల్పన మాట్లాడుతూ పార్టీ చేపట్టే ప్రజా సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై వరంగల్ పార్లమెంట్ పరిధిలో పార్టీ బలోపేతం కోసం అన్ని విధాలుగా కృషి చేస్తానన్నారు. తనను ఆహ్వానించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు.

ఓబీసీ సెల్ ఇన్‌చార్జ్‌గా ప్రవీణ్



జనగామ కల్చరల్, ఏప్రిల్ 15: కాంగ్రెస్ పార్టీ ఓబీసీ సెల్ ఇన్‌చార్జ్‌గా లొక్కుంట్ల ప్రవీణ్ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ఛైర్మన్ నూతి శ్రీకాంత్ గౌడ్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ప్రవీణ్ మాట్లాడుతూ రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో భువనగిరి పార్లమెంటు నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరడానికి ఓబీసీ సెల్ తరపున కృషి చేస్తామన్నారు. పార్లమెంటు అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపిస్తామనే ధీమా వ్యక్తం చేశారు.

ఉద్యోగుల అసోసియేషన్ రాష్ట్ర కమిటీ సభ్యుడి ఎన్నిక

జనగామ కల్చరల్, ఏప్రిల్ 15: రాష్ట్ర ప్రభుత్వ డిగ్రీ కళాశాలల అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ ప్రధాన కార్యదర్శిగా మహ్మద్ సులేమాన్ అహ్మద్ నియమితులయ్యారు. జనగామ ఏబీవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏవోగా బాధ్యతలు నిర్వహిస్తున్న మహ్మద్ సులేమాన్ ఎన్నిక కావడం పట్ల కళాశాల సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు. కాగా కమిటీ అధ్యక్షుడిగా ఆర్.రాంకిషన్, మహిళా అధ్యక్షురాలిగా జేవీఎస్.లక్ష్మీ, ఉపాధ్యక్షులుగా నవీన్, మాధవి, కోశాధికారిగా సీహెచ్.అరవింద్, సంయుక్త కార్యదర్శులుగా నాగ శ్రీనివాస్, అనిత, కార్యవర్గ సభ్యులుగా జగన్‌మోహన్ రావు, కరుణాకర్, శివజ్యోతి, స్వరూపరాణి, అంజద్ అలీ ఎన్నికయ్యారు.

బైకులు ఢీకొని నలుగురికి గాయాలు

స్టేషన్‌ఘన్‌పూర్, ఏప్రిల్ 15: డివిజన్ కేంద్రంలోని ఎస్‌బీఐ ఎదురుగా సర్వీసురోడ్డుపైన ఎదురెదురుగా రెండు బైక్‌లు ఢీకొనగా నలుగురికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. చిలుపూరు మండలం ఫత్తేపూర్ గ్రామానికి చెందిన గుగులోతు నవీన్ సోమవారం తన బైక్‌పై ఘన్‌పూర్‌కు వస్తుండగా, చిలుపూరు మండలం దేశాయితండాకు చెందిన మాలోతు తిరుపతి, తండ్రి ఈర్య, కుమారుడు మోక్షిత్ ఘన్‌పూర్ నుంచి దేశాయితండకు బైక్ వెళుతున్నారు. ఈ క్రమంలో ఎస్‌బీఐ ఎదురుగా రెండు బైక్‌లు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో నవీన్‌కు బలమైన గాయాలు కాగా, తిరుపతి, ఈర్య, మోక్షిత్‌కు స్వల్పగాయాలు అయ్యాయి. స్థానికులు వారిని ఘన్‌పూర్ పీహెచ్‌సీకి తరలించారు.

పెద్దమ్మగుడికి రూ.10వేల విరాళం

చిలుపూర్, ఏప్రిల్ 15 : మండలంలోని కొండాపూర్ పెద్దమ్మ తల్లి ఆలయ అభివృద్ధికి స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకుడు పింగిళి యోగానందరెడ్డి రూ.10 వేలు విరాళంగా అందజేశారు. ఈ నెల 22న నిర్వహించనున్న ప్రతిష్ఠిత మహోత్సవాల్లో భాగంగా ఆలయ కమిటీ ప్రతినిధులు పుట్ట రాజు చిలుపూర్ ఆలయ మాజీ డైరెక్టర్ ఉప్పరి గణేష్‌కు సోమవారం ఆహ్వానపత్రికను అందజేశారు. ఈ సందర్భంగా పుట్ట రాజు మాట్లాడుతూ, ఆలయ అభివృద్ధికి దాతలు సహకారమందించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో గాలి రాజు, మారబోయిన రాజు, కొమురయ్య, పులి సంపత్, చొక్కం కుమార్ పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

చిలుపూర్, ఏప్రిల్ 15 : మండలంలోని లింగంపల్లిలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై ముత్యం రాజేందర్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ గ్రామానికి చెందిన చాతెల్లి రవిందర్ తన ట్రాక్టర్ ద్వారా గ్రామ సమీపంలోని వాగు నుంచి నిత్యం ఇసుక తరలిస్తున్నాడని అందిన సమాచారం మేరకు ట్రాక్టర్‌ను పట్టుకుని సీజ్ చేసి తహసీల్దార్‌కు నివేదించామని తెలిపారు.